నేడు జనం ముందుకు ఇలయ దళపతి

- పార్టీ లక్ష్యాలు, నియమాల ప్రకటన
- అట్టహాసంగా టీవీకే తొలిమహానాడు
- విక్రవాండి అంతటా సందడి

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమిళ సినీ నటుడు 'ఇలయ దళపతి' విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రికళగం (టీవీకే) తొలి మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.సాలై వద్ద 85 ఎకరాల్లో భారీ ఏర్పాట్ల నడుమ ఈనెల 27న ఆదివారం అట్టహాసంగా జరగనుంది. రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు మహానాడుకు తరలిరండి అంటూ పిలుపునిస్తూ పార్టీ శ్రేణులకు విజయ్ బహిరంగ లేఖ రాశారు. సుమారు లక్ష మంది హాజరయ్యేందుకు అనువైన వసతులు కల్పించారు. రాజకీయ ప్రవేశం చేస్తానని విజయ్ ప్రకటించినప్పటి నుంచి రెండేళ్లుగా రాజకీయ సభల్లో ప్రసంగించకపోయినా అన్ని జిల్లాలకు చెందిన, మంచి మార్కులతో ఉత్తీర్ణులైన టెన్త్, ప్లస్-2 పాసైన విద్యార్థులకు నగదు కానుకల పంపిణీ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా విక్రవాండిలో ఏర్పాటైన మహానాడులో విజయ్ ప్రసంగించనున్నారు. ఈ మహానాడులో పార్టీ లక్ష్యాలు, నియమ నిబంధనలు తదితర కీలకమైన విషయాలపై ప్రకటనలు చేయనున్నారు. ప్రస్తుతం విక్రవాండి ప్రాంతమంతటా టీవీకే జెండాలు చేతపట్టుకుని, టీవీకే రంగు దుస్తులు ధరించిన పార్టీ కార్యకర్తలు సందడి చేస్తున్నారు. మహానాడుకు విచ్చేయండంటూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఆహ్వానిస్తున్నారు.

ప్రారంభోత్సవం..

టీవీకే మహానాడు నిర్వహించనున్న వి.సాలైలో ఆదివారం తమిళ సంస్కృతీ సంప్రదాయాలను ఎలుగెత్తి చాటే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు గ్రామీణ కళాకారులు గరగాట్టం, మయిల్‌ఆట్టం, ఒయిలాట్టం, తప్పాట్టం తదితర జానపద నృత్యాలను ప్రదర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు మహానాడు వద్ద బస చేయనున్న ఓ గది నుంచి టీవీకే నేత విజయ్ తనను దగ్గరగా చూడడానికి ఆశపడే పార్టీ శ్రేణుల కోసం 800 మీటర్ల ర్యాంప్ మీద నడిచి వెళ్ళి పార్టీ శ్రేణుల వైపు చేతులూపుతూ వారిలో ఉత్సాహాన్ని కలిగించబోతున్నారు. తొలుత వందడుగుల ఎత్తున్న స్తంభంపై ఆయన పార్టీ పతకాన్ని ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత మహానాడు సభ ప్రారంభమవుతుంది. తొలుత స్వాగతోపన్యాసాలు ముగిశాక, పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మహానాడు లక్ష్యాలు గురించి వివరించనున్నారు. చివరగా విజయ్ ప్రసంగించనున్నారు. ఆయన ప్రసంగాన్ని సభా ప్రాంగణంలో ఉన్న అందరూ తిలకించే రీతిలో భారీ సైజు ఎల్ఈడీ స్ర్కీన్లపై ప్రసారం చేయనున్నారు. విజయ్ తన ప్రసంగంలో పార్టీ లక్ష్యాలు, విధి విధానాలు గురించి వివరించనున్నారు. 178 అడుగుల వెడల్పుతో ఏర్పాటైన వేదిక నుంచి విజయ్ ప్రసంగాన్ని వినడానికి కర్ణాటక, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచీ ఆయన అభిమానులు శనివారం ఉదయమే మహానాడు ప్రాంతానికి చేరుకున్నారు.



కార్యకర్తలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన టీవీకే పతాకాలు



సచివాలయాన్ని తలపించేలా నిర్మించిన ప్రవేశద్వారం సెట్టింగ్



మహానాడులో పాల్గొనేందుకు బెంగళూరు నుండి విచ్చేసిన యువతి

సచివాలయాన్ని తలపించే ప్రవేశద్వారం...

టీవీకే మహానాడు ప్రవేశద్వారం వద్ద రాష్ట్ర సచివాలయ భవనాన్ని తలపించే సెట్టింగ్ ఏర్పాటు చేశారు. 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించి విజయ్ ముఖ్యమంత్రి కావటం తథ్యమని అభిమాన సంఘాల నేతలు చెప్పారు.

కొత్త చరిత్ర సృష్టిద్దాం రండి

విజయ్ పిలుపు

విక్రవాండిలో ఆదివారం జరగనున్న టీవీకే మహానాడు ద్వారా రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టిద్దాం రండి అంటూ ఆ పార్టీ నేత, నటుడు విజయ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ లేఖ రాశారు. ఈ మహానాడుకు విచ్చేసే పార్టీ శ్రేణులకు తాను చెప్పదలచిన ముఖ్యమైన సంగతి ఏమిటంటే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా అందరూ మహానాడుకు రావాలి, ప్రత్యేకించి ద్విచక్రవాహనాలతో రాకుండా ఉంటే మరీ మంచిదని అన్నారు. తన హృదయంలో సుస్థిర స్థానం సంపాదించుకున్న పార్టీ శ్రేణుల ప్రాణాలే తనకు ముఖ్యమని ఈ విషయాన్ని గుర్తుంచుకుని అందరూ క్షేమంగా మహానాడుకు వచ్చి క్షేమంగా తిరిగి వెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

విజయ్‌కి దుబాయ్ సంస్థ సెక్యూరిటీ

టీవీకే నేత, సినీనటుడు విజయ్ తన స్వీయ భద్రత కోసం దుబాయ్‌కు చెందిన జెంటూర్ సెక్యూరిటీ సంస్థ బౌన్సర్లను నియమించుకున్నారు. ఆ సంస్థే గతకొద్ది నెలలుగా విజయ్ పాల్గొనే అన్ని కార్యక్రమాలకు భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది.



మా కూటమిలో చేరండి

- విజయ్‌కి అన్నాడీఎంకే ఆహ్వానం

రాష్ట్రంలో డీఎంకేని ఓడించేందుకు తమ కూటమిలో చేరాలని తమిళగ వెట్రి కళగం నేత, నటుడు విజయ్‌ని అన్నాడీఎంకే ఆహ్వానించింది. ఆ మేరకు అన్నాడీఎంకే సమాచార విభాగం ప్రతినిధి కల్యాణసుందరం శనివారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ రంగ ప్రవేశం చేసి తొలి మహానాడు జరుపుతున్న విజయ్‌కి తమ పార్టీ హార్దిక శుభాకాంక్షలు తెలుపుకుంటున్నదని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాల డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపటానికి అన్నాడీఎంకే నాయకత్వంలో ఏర్పడే బలమైన కూటమికే సాధ్యమవుతుందన్నారు. అన్నాడీఎంకేతో దోస్తీ కడితే విజయ్ రాజకీయ భవిష్యత్తు కూడా ప్రకాశవంతంగా ఉంటుందని చెప్పారు.

7 వేలమంది పోలీసులతో భద్రత..

టీవీకే మహానాడుకు ఏడు వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నారు. అదే సమయంలో భద్రత దృష్ట్యా మహానాడు ప్రాంతానికి చేరువగా ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. ఇక ఈ మహానాడు ఏర్పాట్లను వారం రోజులకు ముందే విజయ్ రాత్రిపూట రహస్యంగా వెళ్లి పరిశీలించారు. పార్టీ సాంకేతిక విభాగ నిర్వాహకులు డ్రోన్లతో ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

100 జనరేటర్లు..

మహానాడు విద్యుత్ సదుపాయం కోసం టీవీకే నిర్వాహకులు రాష్ట్ర విద్యుత్ బోర్డుకు దరఖాస్తు పెట్టుకోలేదు. తొలి మహానాడు కనుక విద్యుత్ సరఫరాలో అంతరాయలు తలెత్త కూడ దన్న భావనతో జనరేటర్ల ద్వారానే విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. ఆ ప్రకారం మహానాడు నలుమూలల సుమారు వంద జనరేటర్లతో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచే విజయ్ అభిమానులు వేల సంఖ్యలో మహానాడు ప్రాంతానికి చేరుకున్నారు. వీరందరికీ మహానాడు నిర్వాహకులు అల్పాహారాన్నిచ్చి తాత్కాలిక బస సదుపాయం కల్పిస్తున్నారు

6 కారవాన్లు, వీఐపీ గది రెడీ..

మహానాడుకు విచ్చేయనున్న టీవీకే అధినేత విజయ్‌కోసం ఆరు కారవాన్లు, ఓ వీఐపీ గదిని సిద్ధంచేసి ఉంచారు. ఈ మహానాడులో ఆదివారం ఉదయం 7గంటలకే విజయ్ జనం ముందు నిలిచి పార్టీ శ్రేణుల నుంచి శుభాకాంక్షలు అందుకోనున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ విజయ్ మహానాడులో పాల్గొననుండటంతో ఆయనకు ఎలాంటి అలుపూసొలుపూ లేకుండా ఉండేందుకు ఆరు కారవాన్లు, ఓ వీఐపీ గదిని సిద్ధం చేసి ఉంచారు.

రెండో దశ మెట్రోరైలు పనులపై సమీక్ష

- సీఎంతో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ భేటీ



సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్, సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో రెండో దశ మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులపై కేంద్ర గృహ వసతి, నగరాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంయుక్తంగా సమీక్షించారు. స్థానిక నందనంలోని చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ప్రసంగిస్తూ... రెండో దశ మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులు పూర్తయితే చెన్నై నగరం అంతర్జాతీయ స్థాయిలో మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తీరుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ.. 2007లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో కేంద్ర ప్రభుత్వ అంగీకారం పొంది 2009లో 54.1 కి.మీల పొడవు మొదటి దశ మెట్రోరైలు మార్గం పనులు చేపట్టామని, ప్రస్తుతం రెండు మార్గాల్లోనూ మెట్రోరైళ్లలో ప్రతి రోజూ 3.1 లక్షల మందికి ప్రయాణిస్తున్నారని చెప్పారు. రెండో దశ మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులు పూర్తయితే నగరం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ దాకా మెట్రోరైలు మార్గం నిర్మించేందుకు కేంద్రం అనుమతి జారీ చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రధాన నగరాలు కోయంబత్తూరు, మదురైలలో మెట్రో రైలు ప్రాజెక్టు అమలుకు ఆమోదం తెలపాలని, ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, కేంద్ర గృహ వసతి, నగరాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.తారా, చెన్నై మెట్రో రైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్, డైరెక్టర్లు డి.అర్జునన్, రాజేష్ చతుర్వేది పాల్గొన్నారు.



మదురై జిల్లాలో వర్ష బీభత్సం





మదురైలో కురిసిన కుండపోత వర్షాలకు జలమయమైన ప్రాంతాలు

- తెగిన వాగులు, చెరువులు
- అన్ని చోట్లా వరద దృశ్యాలే
- సహాయక చర్యలపై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షబీభత్సానికి పరిసర ప్రాంతాల్లోని వాగులు, చెరువులు కట్టలు తెంచుకుని జనావాసాలపై పోటెత్తాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆ తర్వాత చల్లటిగాలులు వీచాయి. కాసేపటికల్లా నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి అరగంటపాటు కుంభవృష్టి కురిసింది. వర్షానికి నగరంలోని విళక్కుతూన్, తెర్కుమాసి వీధి, కీళ్‌వాసల్, కామరాజర్‌సాలై, టౌన్‌హాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని రహదారులలో అడుగులోతున వర్షపు నీరు ప్రవహించింది. అత్తికుళంచెరువు కరకట్ట తెగి జలాలు రహదారులపై పొంగి ప్రవహించాయి. ఇదే విధంగా పుళియంకుళం వాగుకు గండి పడి వాగులోని నీరు రహదారుల్లో ప్రవహించింది. దీంతో సెల్లూరు, అయ్యర్ బంగళా, అత్తికుళం, నరిమేడు, కోసాకుళం, సర్వేయర్ కాలనీ, ఆనైయూరు, కులమంగళం, మహాత్మాగాంధీనగర్, విశ్వనాథపురం, ఇన్‌కమ్‌టాక్స్ కాలనీ రోడ్డు, ముల్లైనగర్, కూడల్ నగర్ సహా 18కి పైగా వీధుల్లో మోకాలిలోతున వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ఇళ్ళలోకి నీరు చొరబడటంతో స్థానికులు కీలకమైన దస్తావేజులను చేతపట్టుకుని సురక్షిత ప్రాంతాలపై పరుగులు తీశారు. చిన్నారులు, వృద్ధులు అవస్థపడ్డారు. మదురై సబర్బన్ ప్రాంతాలైన ఒత్తక్కడై, నరసింగం, రాజగంభీరం, కొట్టికుళం తదితర ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం కురిసింది. నగరానికి సమీపంలో ఉన్న వాగులన్నీ తెంచుకుని జనావాస ప్రాంతాలపై వరదనీరంతా పొంగి ప్రవహించింది. రాత్రి 8గంటల వరకు చెదురుముదురుగా వర్షం కురిసింది. దీంతో వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఇళ్లలోనే చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జలమయమైన ప్రాంతాలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇంటి చుట్టూ రెండడుగుల లోతున నీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేక, విద్యుత్ సరఫరా లేక చీకటిలోనే గడిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల తర్వాత మదురై నగరం అంతటా వరద పరిస్థితులు నెలకొన్నట్లు తెలుసుకున్న ఎంపీ వెంకటేశన్, కలెక్టర్ సంగీత, కమిషనర్ దినేశ్‌కుమార్ ఇతర అధికారులు వరద బాధిత ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. వరదబాధితులందరినీ నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలించారు. వారికి అన్నపానీయాలను అందించారు.

70 యేళ్ల తర్వాత 11 సెం.మీ. వర్షం.. : మదురై నగరంలో 70 యేళ్ల తర్వాత 12 గంటల వ్యవధిలో 11సెం.మీ.ల వర్షం కురిసిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం మూడుగంటల సమయంలో ఊహించని విధంగా 4.5 సెం.మీ.ల వర్షం కురిసింది. ఇలా చినుకులు లేకుండా ఏకధాటిగా కుండపోతగా వర్షం కురవటం వల్లే ముప్పావు శాతం నిండి ఉన్న వాగులు, చెరువులు కట్టలు తెంచుకుని పారిన నీళ్లంతా జనావాస ప్రాంతాలను ముంచెత్తాయి. శుక్రవారం అర్ధరాత్రి వర్షం ఆగిపోయినా, శనివారం మధ్యాహ్నం వరకూ మదురై నగరమంతటా పలు ప్రాంతాలలో నీరు వరదలా ప్రవహించింది. రహదారులపై మురుగునీటితో కలిసి ప్రవహిస్తున్న వాననీటిని అధికారులు భారీ మోటర్లతో తొలగించే పనుల్లో తలమునకలయ్యారు. మదురై, ఉత్తర, పడమర రెవెన్యూ జోన్‌లలో ప్రభుత్వ పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించారు.

స్టాలిన్ సమీక్ష : మదురై నగరంలో ఏర్పడిన వరద పరిస్థితులపై సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వేర్వేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో చర్చించారు. మదురై జిల్లా మంత్రులు మూర్తి, పళనివేల్ రాజన్ వర్ష బాధిత ప్రాంతాల్లో బాధితులకు చేపడుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నా అరివాలయం వద్ద స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ... శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కుండపోతవర్షాలు కురిశాయని చెప్పారు. ఆ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు వర్షబాధిత ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపడుతున్నారని తెలిపారు. మదురైలోని ఎనిమిది ప్రాంతాల్లోనే ప్రస్తుతం ఇళ్లలో వర్షపు నీరు చొరబడిందని,ఆ నీటిని తోడే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. శనివారం మదురైలో మళ్ళీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెప్పడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారన్నారు. చెన్నైలో చేపట్టినట్లు మదురై నగరమంతటా భూగర్భ డ్రైనేజీలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. మదురైలో పరిస్థితులను ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు ఫోన్ చేసి తెలుసుకుంటున్నానని, నగరమంతటా 20 చోట్ల వర్షబాధితులకు ఆరోగ్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

మాజీ మంత్రి వినతి... : మదురై నగరంలో వర్షబాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి మూర్తిని, అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రి సెల్లూరు రాజు కలుసుకుని సహాయక చర్యలను వేగిర పరచాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి మూర్తి ఆయనతో మాట్లాడుతూ వర్షబాధిత ప్రాంతాల్లో సహాయకచర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, పల్లపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, పలు చోట్ల భారీ మోటరు పంపుల ద్వారా వాననీటి తొలగింపు పనులు కూడా జరుపుతున్నామని వివరించారు. ఇదిలా ఉండగా మదురైలో వర్షబీభత్సానికి డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పీఎంకే నేత రాందాస్ విమర్శించారు. ఆ నగరంలో వర్షాకాలానికి ముందే వాననీటి కాల్వలను నిర్మించలేదని, భూగర్భడ్రైనేజీలు కూడా సక్రమంగా లేదని, గంట సేపు కురిసిన వర్షానికే నగరం జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడిందన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సామాజిక బాధ్యత

- మంత్రి నాజర్



చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవడం ఆరోగ్యం కోసం మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత కూడా అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం నాజర్ పిలుపునిచ్చారు. శనివారం తిరువళ్లూరులో అపోలో క్యాన్సర్ సెంటర్‌లో స్థానిక వానగరంలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌తో కలిసి 'పెడల్ పింక్' పేరుతో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా సైక్లోథాన్ ఏర్పాటు చేశాయి. ఈ సైక్లోథాన్‌కు పచ్చజెండా ఊపి ప్రారంభించిన అనంతరం మంత్రి నాజర్ మాట్లాడుతూ... ప్రతి మహిళ తన ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రోత్సహించడంతో పాటు పరస్పరం కుటుంబాలు ఆసరాగా నిలిచేలా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చని, ఈ అవగాహన ప్రచారంలో తానూ భాగస్వామిని కావడం పట గర్వపడుతున్నట్లు తెలిపారు. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, తిరువళ్లూరు మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పి.పాండ్యన్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయప్రకాష్, డాక్టర్ సురేష్, డాక్టర్ మధుప్రియ కూడా పాల్గొన్నారు.

సీఎంతో మిత్రపక్షాల నేతల భేటీ

- సామ్‌సంగ్ సంస్థలో సమస్య పరిష్కారానికి ధన్యవాదాలు తెలిపిన నేతలు



సీఎం స్టాలిన్‌తో తిరుమావళవన్, కె.బాలకృష్ణన్, ముత్తరసన్ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సామ్‌సంగ్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను డీఎంకే మిత్రపక్షాల నేతలు శనివారం నేరుగా వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక తేనాంపేటలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో సీఎంతో డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్, ఎమ్మెల్యే చింతనై సెల్వన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమైన హక్కుల కోసం 37 రోజులు పోరాడిన సామ్‌సంగ్ కార్మికుల సమస్యను నలుగురు మంత్రుల ద్వారా చర్చలు జరిపించి పరిష్కారానికి కారకులైన సీఎం స్టాలిన్‌ను ఈ నేతలు ప్రశంసించారు.

సమాచార దర్శిని

నేడు చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీచ్ రైల్వేస్టేషన్ యార్డులో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఆదివారం చెన్నై బీచ్ - చెంగల్పట్టు మధ్య తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం పార్కు రైల్వేస్టేషన్ నుంచి తెల్లవారుజామున 5 గంటల నుంచి చెంగల్పట్టుకు 23 నిమిషాలకు ఒక ప్రత్యేక రైలు, చెంగల్పట్టు నుంచి తెల్లవారుజామున 4 గంటల నుంచి పార్కు రైల్వేస్టేషన్ వరకు 25 నిమిషాలకు ఒక రైలు నడపనున్నారు. అలాగే, తాంబరం నుంచి వేకువజామున 3.55 గంటల నుంచి పార్కు రైల్వేస్టేషన్‌కు 30 నిమిషాలకు ఒక రైలు అని 13 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది.

పశువుల సంరక్షణ కేంద్రాలు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో 12 ప్రాంతాల్లో పశువుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ విషయమై జీసీసీ అధికారి మాట్లాడుతూ... నగరంలో రోడ్లపై సంచరిస్తున్న పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తగిన స్థలం లేకపోవడంతో యజమానులు వాటిని రోడ్లపైకి వదులుతున్నారన్నారు. ఇలా వదిలే పశువులను బంధించి యజమానులకు జరిమానా విధిస్తున్నామన్నారు. ఈ క్రమంలో, పశువులను సంరక్షించేలా ప్రస్తుతం రెండు స్థలాలు అందుబాటులో ఉండగా, త్వరలో మరో 12 ప్రాంతాలు ఎంపిక చేయనున్నామన్నారు. యజమానులను ఈ స్థలాలకు అద్దె చెల్లించి తమ పశువులను సంరక్షించుకోవచ్చని అధికారి తెలిపారు.

గిండి ఆస్పత్రిలో 11 ఉప వైద్యకోర్సులకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని కలైంజర్ సెంటలినరీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో 11 ఉప వైద్య కోర్సులకు వైద్య విద్య డైరెక్టరేట్ అనుమతించింది. ఎనిమిది సర్టిఫికేట్ కోర్సులు, 2 డిప్లొమా కోర్సులు, డిగ్రీ కోర్సులుంటాయి. మత్తు నిపుణులు, డయాలసిస్ అసిస్టెంట్, అత్యవసర చికిత్స అసిస్టెంట్ సహా 8 సర్టిఫికేట్ కోర్సులున్నాయి. మొత్తం ఉప వైద్య కోర్సుల్లో 195 సీట్లున్నాయని, నీట్ లో తక్కువ మార్కులొచ్చి ఎంబీబీఎస్ సీటు పొందలేని వారికి ఈ కోర్సులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అడ్మిషన్ల నోటిఫికేషన్ డిసెంబరులో విడుదల కానుందని ఆస్పత్రి డైరెక్టర్ పార్థసారథి తెలిపారు.

గ్రాడ్యుయేషన్‌తో వృత్తి శిక్షణ


పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్‌తో పాటు వృత్తి శిక్షణ అందించి, కళాశాల విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేలా యూజీసీ నిర్ణయించింది. ఈ విధానానికి సంబంధించి ప్రజాభిప్రాయం సేకరించనుంది. మూడేళ్ల గ్యాడ్యుయేషన్‌లో మొదటి మూడు సెమిస్టర్లు, నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో 2,3,4 సెమిస్టర్లలో పారిశ్రామిక సంస్థల్లో వృత్తిపరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఆ సమయంలో భత్యం కూడా అందించనున్నారు. ఈ విధానంలో విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు తమ అభిప్రాయాలను https://www.ugc.gov.in/Notices లో పేర్కొనవచ్చు.

విద్యుత్ కంచెల ఏర్పాటు చట్టవిరుద్ధం

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల్లో విద్యుత్ కంచెల ఏర్పాటు చట్టప్రకారం నేరమని విద్యుత్ బోర్డు హెచ్చరించింది. నీలగిరి, కోవై, తిరునల్వేలి, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో కొండలు, అటవీ ప్రాంతాల సమీపంలో నివసిస్తున్న వారు, తమ పంటలను జంతువుల బారి నుంచి కాపాడుకొనేలా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఆహారం కోసం ఈ ప్రాంతాలకు వస్తున్న జంతువులు కంచెలో చిక్కుకుని మృతి చెందుతున్నాయి. దీన్ని అడ్డుకొనేలా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు చేపట్టడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించింది.

అన్నా వర్శిటీలో 'ఫైనాన్షియల్ అనలిటిక్స్' ఆన్‌లైన్ కోర్సు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ (ఎన్ఎస్ఈ) సహకారంతో అన్నా యూనివర్శిటీ ఆర్థిక విశ్లేషణలో ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సు అందించనుంది. గ్రాడ్యుయేట్లు, చివరి సంవత్సరం కళాశాల విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారు, వ్యాపారులు ఈ 11 నెలల కోర్సులో చేరవచ్చు. వారాంతపు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించనున్నారు. పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించి సర్టిఫికేట్లు అందజేయనున్నారు. ఈ కోర్సు ముగించిన వారు స్టాక్ మార్కెట్ అనలిస్ట్, ఫైనాన్షియల్ టెక్నాలజీ అనలిస్ట్, ఫైనాన్షియల్ అడ్వయిజర్, ఫండ్ మేనేజర్, ఇన్వెస్ట్‌మెంట్ అనలిస్ట్ తదితర ఉద్యోగాల్లో చేరవచ్చు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 30వ తేదిలోగా యూనివర్శిటీ వెబ్‌సైట్ www.anna-univ.e-du లో దరఖాస్తు చేసుకోవచ్చే, డిసెంబరులో అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి, వచ్చే ఏడాది జనవరి 2 నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభిస్తామని వర్శిటీ తెలియజేసింది.



వేలూరు జిల్లా ఆనైకట్టు పంచాయతీ యూనియన్ మందవెల్లి పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో రూ.1.10 లక్షలతో నిర్మిస్తున్న స్మార్ట్ తరగతి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, తహసీల్దార్ వేండ, అసిస్టెంట్ పథక అధికారి యువరాజ్, బీడీఓలు పారి, ప్రేమలత తదితరులు
- వేలూరు, ఆంధ్రజ్యోతి

పిల్లలకు జీవిత విలువలు నేర్పించండి

రెవరెండ్ రాజేంద్ర ప్రసాద్ ● ఎంసీటీబీసీలో అలరించిన చిన్నారుల సంబరం



చిన్నారులతో రాజేంద్రప్రసాద్, పోతల ప్రభుదాస్, బాబు తదితరులు

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు చిన్నవయసులోనే జీవిత విలువలు నేర్పిస్తే పెద్దవారయ్యాక దేశానికి, సమాజానికి దీవెనకరంగా ఉంటారని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ) కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వెప్పేరి హైరోడ్డులోని సంఘ ప్రాంగణంలో శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్నారుల సంబరం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిల్లలు పాటలు, ఆటలు, కథలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. గ్లోరీ చిల్డ్రన్ మినిస్ట్రీ ప్రతినిధి జెబరాజ్ మనసే మ్యాజిక్, పప్పెట్ షోతో పిల్లలను ఆకట్టుకున్నారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ ఎ.బాబు, సండే స్కూల్ సూపరింటెండెంట్ ఎం.సువార్త, అన్ని కమిటీల నిర్వాహకులు, ఎల్కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ చిన్నారులకు క్రమశిక్షణ, అభివృద్ధి, గురువులు, తల్లిదండ్రులు, సమాజం పట్ల చూపాల్సిన గౌరవం తదితర అంశాలపై సలహాలిచ్చారు. చిన్నపిల్లలను క్రమశిక్షణతో పెంచే బాధ్యత తల్లిదండ్రులది మాత్రమే కాదని, చుట్టూ ఉన్న సమాజానికి, ముఖ్యంగా క్రైస్తవ సంఘానికి ఉందన్నారు. కార్యక్రమంలో చివరగా చిన్నారులకు బహుమతులు ప్రదానం చేసి నిర్వాహకులు అభినందించారు.

రామస్వామి ఉడయార్ ఇంటర్ స్కూల్ చర్చాగోష్టి

● దేవి అకాడమీకి తొలి బహుమతి



అడయార్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామ చంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి ఆధ్వర్యంలో 'ఎన్‌పీవీ రామస్వామి ఉడైయార్ అంతర్ కళాశాల చర్చాగోష్టి పోటీలు జరిగాయి. సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక వలసరవాక్కంలోని దేవి అకాడమీ సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు వన్షసర్దా, పర్మేష్ మొదటి బహుమతిని గెలుచుకున్నారు. అలాగే, ఎస్‌బీఓఏకు చెందిన వినవీన్ పాల్, మెలీనా బినొయ్ రెండో బహుమతిని, డీఏవీ హయ్యర్ సెకండరీ పాఠశాలకు చెందిన ఎస్.శ్రుతి, భావనశ్రీ మూడో బహుమతిని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో 25 పాఠశాలలకు చెందిన 65 టీంల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి పాల్గొని విజేత విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కేవీ సోమసుందరం, ప్రొఫెసర్ సెల్వన్ జేసయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవనానికి భూమి పూజ



భూమి పూజలో ఎమ్మెల్యే రవి

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా సెంబేడు పంచాయతీ కొత్త భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ జరిగింది. ఈ భవన నిర్మాణాలకు అరక్కోణం ఎమ్మెల్యే రవి నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవి, పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు వడివేలు, పంచాయతీ సెక్రటరీ నారాయణన్, వార్డు సభ్యులు సుబ్రమణి, ఆర్ముగం, మణికంఠన్ తదితరులు భూమి పూజలో పాల్గొన్నారు.

వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం జన్మదిన వేడుకలు

● వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు





టీటీడీ సమాచార కేంద్రం లోని వేంకటేశ్వర ఆలయంలో బాలచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు - జీవీ సెల్వంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం అధ్యక్షుడు జనార్దనన్, నిర్వాహకులు రమేష్‌కుమార్ జైన్, లలిత, బాలసుబ్రమణ్యం తదితరులు

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే న్యాయవాదుల విభాగం అధ్యక్షుడు బాలచందర్ నేతృత్వంలో శనివారం వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం పుట్టిన రోజు సందర్భంగా స్థానిక టీటీడీ సమాచార కేంద్రంలోని వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకం, అలంకారం, దీపారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు శ్రీవారి లడ్డూలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు ప్రభాకరన్, శరవణన్, సత్యమూర్తి, దొరై, నారాయణన్, షడోగోపన్, పళని సహా పలువురు పాల్గొన్నారు.

ఎన్నికలపై ముగ్గులతో అవగాహన



కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, అధికారులు

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2025వ సంవత్సరం కోసం ఓటరు జాబితాలో సవరణలు చేపట్టనున్నారు. అలాగే, 18 ఏళ్ల నిండిన వారి పేర్లను ఓటరు జాబితా చేర్చేలా ఈ నెలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితా సవరణలను ప్రజలకు తెలియజేసేలా శనివారం కొత్త బస్టాండ్ వద్ద ముగ్గులు వేశారు. కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ప్రారంభించగా, కార్పొరేషన్ కమిషనర్ జానకి, వేలూరు సబ్ కలెక్టర్ బాలసుబ్రమణ్యన్, పిల్లల అభివృద్ధి పథక జిల్లా అధికారి శాంతి ప్రియదర్శిని, వేలూరు తహసీల్దార్ మురళీధరన్, ఎన్నికల తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినాశి వద్ద లారీని ఢీకొన్న కారు

ఇద్దరు యువతులు సహా ముగ్గురి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశి సమీపంలో లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినులు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కోయంబత్తూరు మరుదమలై రోడ్డు ఐఓబీ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం కుమార్తె అపర్ణ (26) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఐఐఎంలో ద్వితీయ సంవత్సరం ఎంబీఏ చదువుతోంది. మరో కుమార్తె హేమ (21) కోయంబత్తూరు ప్రైవేటు కాలేజీ బీఈ చదువుతోంది. కోయంబత్తూరు ఆర్ఎస్‌పురంలో నివసిస్తున్న అపర్ణ స్నేహితుడు మోనిష్ బాబు(28) వీరిరువురిని వెంటబెట్టుకుని కారులో బెంగళూరుకు వెళ్లి గురువారం రాత్రి స్వస్థలానికి బయలుదేరారు. శుక్రవారం వేకువజాము తిరుప్పూరు జిల్లా అవినాశి వద్ద ఆ కారు అదుపు తప్పి సిమెంట్ గోదాము వద్ద నిలిచి ఉన్న లారీని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణించిన ముగ్గురూ తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న అవినాశి పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కారు శిథిలాల మధ్యఉన్న మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

9 నెలల చిన్నారి... : సేలం-చెన్నై జాతీయ రహదారిలోని ముత్తంబట్టు బస్టాండ్ సమీపంలో వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వంతెన స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న 9నెలల చిన్నారి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, తల్లితండ్రులు దీపక్, దైవానై తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఎనిమిది వారాల్లో తొలగించండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేట అర్బన్ హ్యాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు అధీనంలోని నివాసాల్లోని 1,700 అక్రమ నిర్మాణాలను రెండున్నరేళ్లుగా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు, వాటిని 8 వారాల్లోగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలోని బోర్డుకు సొంతమైన అపార్ట్‌మెంట్‌లో అనుమతి లేకుండా నిర్మించిన వెయ్యికిపైగా నిర్మాణాలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని తూయమూర్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామ్మూర్తితో కూడిన ధర్మాసనం శనివారం విచారించింది. ఆ సమయంలో బోర్డు కార్యదర్శి దాఖలు చేసిన నివేదికలో... 2022 సర్వే ప్రకారం ఈ ప్రాంతంలో 1,700 అక్రమ నిర్మాణాలున్నాయన్నారు. శిథిలావస్థకు చేరిన ఈ గృహాలు కూల్చివేసి మళ్లీ కొత్త గృహాలు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. వాటిల్లో నివసిస్తున్న వారు ఖాళీ చేసేందుకు నిరాకరిస్తుండడంతో, ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయడంలో ఇబ్బందులు తలెత్తున్నాయని, ఆక్రమణలు త్వరలో తొలగిస్తామని బోర్డు నివేదికలో పేర్కొంది. అందుకు ధర్మాసనం స్పందిస్తూ... 2022లోనే 1,700 అక్రమ నిర్మాణాలున్నట్లు చెబుతున్న నేపథ్యంలో, రెండున్నరేళ్లుగా వాటిని ఎందుకు తొలగించలేదని ప్రశ్నించింది. తొలిగింపునకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంలో విధుల్లో నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉందన్నారు. అనంతరం, ఈ 1,700 అక్రమ నిర్మాణాలను 8 వారాల్లోపు తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, నగర ప్రాంత అభివృద్ధి బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అదే సమయంలో శాంతి భద్రతలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా అధికారులకు సహకరించాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్‌కు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ వాయిదావేసింది.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● అథ్లెటిక్ ఆర్తీ జయబాలన్



ఒలంపిక్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఆర్తీ జయబాలన్, ఎస్ఎల్ సుదర్శనం, దేసు లక్ష్మీనారాయణ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా కృషి చేయాలని గావ్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎయిర్‌గన్ షూటర్, కరాటే ట్రైనర్ ఆర్తీ జయబాలన్ పిలుపునిచ్చారు. ఆదియప్ప వీధిలోని ఎస్కేపీడీ చారిటీస్ నిర్వహణలోని ఎస్కేపీడీ బాలుర ప్రాథమిక, మహోన్నత పాఠశాలలు, కేటీసీటీ బాలికల ప్రాథమిక, మహోన్నత పాఠశాలల వార్షిక క్రీడా దినోత్సవం శనివారం సాయంత్రం ఎస్కేపీడీ కన్వెన్షన్ హాలులో పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షతన ఘనంగా జరిగింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.అనిలా, ఓరుగంటి లీలారాణి, చుక్కా రేవతి, ఇ.రమేష్, క్రీడా విభాగం కార్యదర్శులు వి.దేవి, పి.గౌరిశంకర్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్తీ జయబాలన్... విజేతలకు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేసి అభినందించారు. ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఊటుకూరు శరత్‌కుమార్, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, తాతా బద్రీనాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్, అడ్వయిజర్ డా.జేవీ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెదసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డమ్ బెల్స్, హూప్స్, యోగాసనాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

ముందస్తు రిజర్వేషన్ చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రద్దీలో చిక్కుకోకుండా ముందస్తు రిజర్వేషన్ చేసుకొని ప్రయాణించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సచివాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 31న దీపావళి పండుగను స్వగ్రామాల్లో జరుపుకొనేందుకు నగరం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వెళ్లే అవకాశముందన్నారు. స్వగ్రామాలకు వెళ్లే వారి సౌకర్యార్థం కోయంబేడు, కీలంబాక్కం, మాధవరం బస్ స్టేషన్ల నుంచి ఈ నెల 28, 29, 30 తేదీల్లో సుమారు 14,086 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపింది. ప్రజలు రద్దీలో చిక్కుకోకుండా ముందుగానే రిజర్వేషన్ చేసుకొని ప్రయాణించాలని, రద్దీని పరిగణలోకి తీసుకొని అదనపు బస్సులు నడుపుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో సైనికుడి మృతి



మృతుడు రాజారామ్ (ఫైల్ ఫొటో)

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి వళ్లిమలైకు చెందిన పెరుమాళ్ కుమారుడు రాజారామ్ (26) డెహ్రాడూన్‌లోని సైనిక దళంలో పని చేస్తున్నాడు. 10 రోజుల క్రితం తండ్రిని చూసేందుకు సెలవుపై వచ్చాడు. శుక్రవారం రాత్రి రాజారామ్ విరుదంబట్టు సమీపంలో స్కూటర్‌పై వెళుతుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాజారామ్ తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. విరుదంబట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విచారణకు నకిలీ ప్రొఫెసర్లు డుమ్మా

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకే సమయంలో పలు కళాశాలల్లో పనిచేసిన మోసం వ్యవహారంలో, ఆరోపణలు ఎదుర్కొంటున్న 676 మంది ప్రొఫెసర్లలో అధిక శాతం మంది విచారణకు హాజరుకాకుండా సతాయిస్తున్నట్లు సమాచారం. అన్నా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో ప్రొఫెసర్ల నియామకంలో జరిగిన మోసం సంచలనం రేపింది. 676 మంది ప్రొఫెసర్లు ఒకే సమయంలో వేర్వేరు కళాశాలల్లో శాశ్వత ప్రొఫెసర్లుగా పని చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మోసాన్ని అర్పోర్ ఇయక్కం వెలుగులోకి తీసుకొచ్చింది. మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపడతామని అన్నా విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. తొలివిడతగా, ఈ అవినీతిలో భాగస్వామ్యులైన కళాశాలల్ని సంజాయిషీ కోరగా, ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. గత ఆగస్టు నెలలో మోసానికి పాల్పడిన 676 ప్రొఫెసర్లను సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు. కానీ, ఈ జాబితాలో ఉన్న 25 శాతం మంది మాత్రమే విచారణకు హాజరయ్యారు. పొరుగు జిల్లాల నుంచి ప్రొఫెసర్లు చెన్నైకి రావడంలో ఇబ్బందులు పడతారనే కారణంతో, మండలాల వారీగా 6 బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నాలుగు ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టాయి. మిగిలిన రెండు ప్రాంతాలైన చెన్నై, కోవైలో ఈ నెలాఖరులోపు విచారణ పూర్తి చేయనున్నట్టు సమాచారం. విచారణకు హాజరైన 170 మంది ప్రొఫెసర్లలో, అధిక శాతం మంది, తమపై మోపిన ఆరోపణల గురించి తమకు ఏమీ తెలియదని సమాధానమిచ్చారు. మొత్తం మీద నేరారోపణ ఎదుర్కొంటున్న వారిలో 25 శాతం మంది మాత్రమే విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది.

విస్తరణ దిశగా 'నాడి ఎయిర్ టెక్నిక్స్'



మీడియా సమావేశంలో సల్దన్‌హా, కందార్

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు 'నాడి ఎయిర్ టెక్నిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జేబీ కందార్, డైరెక్టర్ ఆరాన్ సల్దన్‌హా ప్రకటించారు. శనివారం చెన్నైలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. తమ సంస్థ 70వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇంజనీరింగ్ రంగంలో మహిళలకు సాధికారత కల్పించేందుకు 'ది పింక్ బే'ను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ నెల 28న జరగనున్న వార్షికోత్సవానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్, వాబ్‌టెక్ కార్పొరేషన్ ఇండియా రీజనల్ లీడర్ డాక్టర్ సుజాత నారాయణ్ గౌరవ అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో రూ.90లక్షల బంగారం స్వాధీనం

● శ్రీలంక ప్రయాణికుడి అరెస్టు

చెన్నై, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి విమానంలో రూ.90లక్షల బంగారాన్ని అక్రమంగా తరలించిన శ్రీలంక ప్రయాణికుడిని మీనంబాక్కం విమానాశ్రయ పోలీసులు అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి విమానంలో వచ్చి, మీనాంబాక్కం విమానాశ్రయం నుంచి మరో విమానంలో శ్రీలంకకు బయలుదేరటానికి సిద్ధమైన ప్రయాణికుడి ప్రవర్తన పోలీసులకు అనుమానం కలిగించింది. పోలీసులు తనను గమనిస్తున్నట్లు తెలుసుకున్న ఆ ప్రయాణికుడు టాయిలెట్‌కు వెళ్లి చాలా సేపటి వరకు బయటకు రాలేదు. ఆ తర్వాత ఆ ప్రయాణికుడు వెలుపలికి రాగానే పోలీసులు ఆ టాయిలెట్‌లో తనిఖీ చేసినప్పుడు ఓ ప్లాస్టిక్ సంచిలో దాచి ఉంచిన బంగారం పట్టుబడింది. ఆ బంగారం విలువ రూ.90లక్షలని చెప్పారు. వెంటనే ఆ ప్రయాణికుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రమాదరహిత దీపావళిపై అవగాహన



విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా అగ్నిమాపక శాఖ, కాట్పాడి రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రమాదరహితంగా దీపావళి జరుపుకొనేలా అవగాహన ప్రచారం నిర్వహించారు. ఊసూరు ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ అధ్యక్షత వహించగా, ఇండియన్ రెడ్‌క్రాస్ కాట్పాడి శాఖ అధ్యక్షుడు జనార్దనన్ ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక కేంద్రం అధికారి తనిగైవేలు, సిబ్బంది పార్తిపన్, భరత్, హరీష్, కుమరప్ప, దినేష్... టపాసుల ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, వారికి ప్రాథమిక చికిత్స తదితరాలను ప్రదర్శించారు. అలాగే, టపాసులు కాల్చే విధానాలను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయులు గాయత్రి, మలర్‌విళి, రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ రాధాకృష్ణన్ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు కోటీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలంటూ పీఎంకే ఆందోళన



వేలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలారు ఒడ్డున ప్రజలకు ఆటంకంగా, పాలారు నదిని కాలుష్యం చేస్తున్న టాస్మాక్ దుకాణాన్ని వెంటనే తొలగించాలని పీఎంకే ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా సెక్రటరీ శరవణన్, రాష్ట్ర కమిటీ సభ్యులు గిరికుమరన్, మూర్తి, నటరాజన్, జిల్లా వ్యాపారుల సంఘ సెక్రటరీ మణివన్నన్, లక్ష్మణన్ సహా పార్టీ అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మద్యం దుకాణాన్ని తొలగించని పక్షంలో తామే దుకాణానికి తాళాలు వేస్తామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు.

తంజావూరు సముద్రతీరంలో రూ.2 కోట్ల మాదకద్రవ్యాల స్వాధీనం



పాలిథీన్ సంచిని పరిశీలిస్తున్న అధికారులు

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా అదిరామపట్టినం సమీపం రాజమఠం నగర పంచాయతీకి చెందిన కీళ్‌తోట్టం సముద్రతీరంలో రూ.2కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సముద్రతీరంలో పెద్ద సంచి పడి ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో సముద్రతీర భద్రతాదళం సీఐ మంజుల, ఎస్ఐ పిచ్చై వేంబు, రాజశేఖర్ ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పాలిథీన్ సంచిని తెరచి చూడగా అందులో 900 గ్రాముల మాదకద్రవ్యం లభించింది. ఆ మాదక ద్రవ్యం విలువ రూ.2 కోట్లని చెప్పారు. సముద్రతీర భద్రతా దళం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రైలు బ్రేక్ షూ ఊడిపడి రైతు మృతి

ప్యారీస్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పరమకుడి సమీపంలో రన్నింగ్‌లో ఉన్న రైలు బ్రేక్ షూ ఊడిపడిన ఘటనలో రైతు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పరమకుడి సమీపంలోని ఎట్టివయల్‌లో ఉన్న తన పొలానికి శనివారం ఉదయం రైలు పట్టాల పక్కన షణ్ముగవేల్ (61) నడిచివెళ్తుండగా మదురైకు వెళుతున్న రైలు బ్రేక్ షూ హఠాత్తుగా ఊడి గాల్లో ఎగురుతూ వచ్చి ఆయనపై పడింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు స్థలం ఇచ్చిన రైతుకు ఇంటి పట్టా

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో పాఠశాలకు స్థలం అందించిన రైతుకు ఇంటి పట్టాను మంత్రి కేఎన్ నెహ్రూ అందజేశారు. ధర్మపురి జిల్లా పొమ్మిడి సమీపం జాలిపుదూర్ పంచాయతీలో ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఏర్పాటుకు 2006లో 80 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేశారు రైతు మురుగేశన్. తన సొంత స్థలాన్ని పాఠశాలకు విరాళంగా అందజేసి నివసించేందుకు ఇల్లులేని రైతు మురుగేశన్, రేగడహల్లిలోని అగరం ఆస్పత్రిలో నైట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తూ అక్కడే బసచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో, పాఠశాలకు స్థలం అందజేసిన రైతు మురుగేశన్‌కు సొంత ఇల్లు లేదని ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికెళ్లింది. ముఖ్యమంత్రి ఉత్తర్వులతో, మురుగేశన్‌కు స్థానిక సంస్థల శాఖ తరఫున ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టిలో జరిగిన ప్రభుత్వ సంక్షేమ సహాయాల పంపిణీలో పాల్గొన్న మంత్రి కేఎన్ నెహ్రూ, మురుగేశన్‌కు ఇల్లు కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

రిజర్వుబ్యాంక్ వద్ద పొరపాటున పేలిన తుపాకీ

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ సమీపంలో రిజర్వు బ్యాంక్ వద్ద భద్రతా విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ చేతిలోని తుపాకీ పొరపాటున పేలడంతో కలకలం రేగింది. దీంతో బ్యాంక్ ప్రాంగణం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. శనివారం ఉదయం ఆ బ్యాంక్ వద్ద హఠాత్తుగా అలారం మోగింది. దీంతో ఆ మహిళా కానిస్టేబుల్ తనవద్దనున్న తుపాకీలో తూటలను నింపుకుని లోపలకు వెళ్ళింది. బ్యాంక్ లోపల ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలుసుకుంది. దీంతో తుపాకీ నుంచి తూటాలు వెలుపలికి తీస్తుండగా పొరపాటున పేలంది. దీంతో ఆ బ్యాంక్‌వద్ద లావాదేవీల కోసం వచ్చిన వ్యాపారులు, స్థానికులు బిత్తరపోయారు. చివరకు పొరపాటున పేలిందని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

'అత్తా ఒకింటి కోడలే', 'అత్త మీద కోపం దుత్తమీద చూపించినట్లు', 'అత్త కాలం కొన్నాళ్లు - కోడలి కాలం కొన్నాళ్లు', 'అత్త చేసిన పనికి ఆరళ్లు లేవు', 'అత్త సొమ్ము అల్లుడు ధారపోసినట్లు' ... - ఏమిటీ! అత్తగారి గురించి ఇన్ని సామెతలా అని అవాక్కవుతున్నారా? ఇవే కాదు, మరెన్నో ఉన్నాయి. చివరకు దంపుళ్ల పాటలో జానపదులు కూడా "అత్త లేని కోడలు ఉత్తమురాలు - కోడలు లేని అత్త గుణవంతురాలు' అని పాడుకుంటారు. మరి ఇంతగా జీవితాలను ప్రభావితం చేసి ఆధిక్యం చూపే అత్త అంటే గయ్యాళా? రాక్షసా? కాదు. కానే కాదు. అత్తంటే అమ్మ తర్వాత అమ్మ. అమ్మను మరిపించే అమ్మ. అమ్మకు ప్రతిరూపమైన అమ్మే అత్తమ్మ. ఆమె పేరిట 'ప్రపంచ అత్తగార్ల దినోత్సవం' జరిపి కృతజ్ఞతలు - శుభాకాంక్షలు అందజేస్తుంటారు మరి! - వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

■ నేడు ప్రపంచ అత్తగార్ల దినోత్సవం

'అత్తా ఒకింటి కోడలే'

తన జీవిత భాగస్వామిని కన్న తల్లిని గౌరవించే ఈ సంప్రదాయం 'అత్తగార్ల దినోత్సవం' పేరిట అమెరికాలోని టెక్సస్‌లో 1934వ సంవత్సరంలో ప్రారంభమైంది. 1970వ సంవత్సరంలో అక్టోబరు 4వ ఆదివారాన్ని ప్రపంచ అత్తగార్ల దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయం తీసుకోబడింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 4వ ఆదివారం 'అత్తగార్ల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. ఈ సంవత్సరం అక్టోబరు 27వ తేది 4వ ఆదివారం కాబట్టి ఈ రోజు జరుపుకుంటున్నాం.

కాలానుగుణంగా...

కాలం గడిచే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు వచ్చాయి. అధికారదర్పం, ఆధిక్యత, ఇంటి పెత్తనం, అజమాయిషీ.. వీటన్నిటితో పాటు కొడుకు ప్రేమ తనకే ఉండాలనుకోవడం మొదలైన కారణాలు అత్తల మనసులను కలుషితం చేశాయి. సినిమాల్లో కోడళ్లని ఆరళ్లపెట్టిన అత్తలు ఉండబట్టే అత్తల పాత్రలు సహజంగా సినిమాల్లో రక్తికట్టాయి. ఇంకో మెట్టు పైకెక్కి టీవీ సీరియళ్లు అత్తను రాక్షసిగా, వాంప్‌గా చిత్రీకరిస్తున్నాయి. అత్తగారి మీద వ్యంగ్య, హాస్య, కాల్పనిక కథలెన్నో వచ్చాయి. భానుమతి రాసిన 'అత్తగారి కథలు'లో అత్తగారు అమాయకంగా కనిపించినా, అన్ని విషయాలలో చొరవ, మంచితనం మూర్తీభవించినట్లు దర్శనమిస్తుంది. భానుమతి 'అత్తగారి కథల'న్నీ నిఖార్సయిన అత్తగారికి చిరునామాలే. అత్తగారి ఆరళ్లు విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని'కీ తప్పలేదు. విశ్వనాథ వారు రాసిన 'కిన్నెరసాని పాటల'లో నాయిక కిన్నెర ఒక వాగు. దానికి ఒక స్త్రీమూర్తికి ప్రతీకగా భావించారు. అత్త ఆరళ్లకు తట్టుకోలేక కిన్నెరసాని ఇంటినీ, భర్తనూ వదిలి అడవులలోకి వెళుతుంది.

అటు... ఇటు.. మంచీచెడూ...

కాలం మారింది. ఉమ్మడి కుటుంబాలకు కాలం చెల్లింది. చిన్న కుటుంబాల ప్రాముఖ్యత పెరిగింది. తప్పనిసరి పరిస్థితులలో తప్ప అత్త, కోడళ్లు కలిసి ఉండే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. అత్తగారి పాత్ర మారింది. కట్నం వేధింపులు, గృహహింస కూడా చోటుచేసుకున్నాయి. అత్తగారి ఆజ్ఞకు లోబడి ఎంతోమంది చదువుకున్న వనితలు కూడా తమకు ఇష్టమైన వృత్తి, ప్రవృత్తులకు స్వస్తి పలుకుతున్నారు.అలాగే,కోడలికి భయపడి రోజులు భారంగా వెళ్లదీసే పరిస్థితులు అత్తలకూ వచ్చాయి. మంచీ, చెడు రెండూ మనుషులలో ఉన్నట్లే అత్తలలో కూడా రెండు రకాలవారు. అయితే ఎంతోమంది అత్తలు కూడా విద్యావంతులై, ఉద్యోగాలు చేసి ఉండడంతో, కష్టనష్టాలు తెలిసికొని ఉద్యోగస్తురాలైన కోడలికి తమవంతు సాయమందిస్తున్నారు.

అత్తగార్ల దినోత్సవం ఏ విధంగా జరుపుకోవచ్చు?

తమ దగ్గరే అత్తగారు ఉంటే ఇంట్లో ప్రత్యేకించి ఆమెకు ఇష్టమయిన వంటకాలతో విందు చేయడం లేదా నచ్చిన, ఆమె మెచ్చిన రెస్టారెంట్‌లో ఆమెతో కలసి భోజనం చేయడం, ఆమె మనోభావాలకు తగిన పుస్తకాలో, దుస్తులో మరేదైనా కానీ బహుమతిగా ఇవ్వడం మొదలైన వాటితో ఆమెను సంతోషపరచవచ్చు. ఆమెను నచ్చిన ప్రదేశానికి తీసికొని వెళ్లవచ్చు. దూరంగా ఉన్నా, దగ్గరగా ఉన్నా కానీ ఆ రోజు అత్తతో కోడళ్లు, అల్లుళ్లు కలిసి గడిపితే అంతకుమించిన ఆనందం ఏముంటుంది? అత్తలు పిల్లల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూడకుండా హుందాగా ప్రవరిస్తూ, వారికి అవసరమైన సలహాలు, సహకారం అందిస్తే ఆ ఇళ్లలో ప్రతినిత్యం అత్తగార్ల పండగే. కోడళ్లు, అల్లుళ్లు అత్తల పెద్దరికానికి విలువనిచ్చి, గౌరవప్రదంగా చూసుకుంటే ప్రపంచ అత్తగార్ల దినోత్సవం సార్థకమైయినట్లే. అంతేకాదు ఈ దేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా అత్త, కోడలు, అత్త, అల్లుడు మధ్య సత్సంబంధాలు, ఆప్యాయతానురాగాలు ఉంటే వారింట మమతానురాగాల వెల్లువే. ప్రపంచ అత్తగార్ల దినోత్సవం సందర్భంగా కొందరు అత్తలు, కోడళ్లు, అల్లుళ్ల మనోభావాలు..



ఆత్మకూరు రమ (అత్తగారు)

మా కొడుకు, కోడలు మాతోనే ఉంటారు. కోడలు శ్రీవిద్య నాకు కూతురు లాగే. ఇంటా, బయటా కూడా నాకు అన్నివిధాలా సహకరిస్తుంది. మా ఆరోగ్య విషయాలలో ఎంతో జాగ్రత్త వహిస్తుంది. ఉద్యోగస్తురాలైనా ఏ మాత్రం గర్వం లేకుండా అణకువగా, ఇంటి పనుల్లో కూడా వీలైనంత సాయం నాకు అందిస్తుంది.

శ్రీవిద్య (కోడలు)

మా అత్తగారు నాకు సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత గురించి ఎన్నో విషయాలు నేర్పించారు. నా మనోభావాలను ఆమెతో జంకులేకుండా పంచుకొనే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఇవ్వడమే కాకుండా, తన కూతురితో సమానంగా ప్రేమను పంచుతూ ఆదర్శనీయంగా ఉండే మా అత్తగారంటే నాకు గౌరవమర్యాదలు, ప్రేమాభిమానాలు.

మంగళా కందూర్ (అత్తగారు)



నాకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్లు, నా అల్లుళ్లు ఇద్దరూ నాకు కొడుకులతో సమానం. చెన్నైలో ఉన్న పెద్ద కుమార్తె సునీత భర్త అజిత్. చెన్నైలో నేను స్వతంత్రంగా జీవించాలనే ఉద్దేశంతో వేరుగా ఉన్నా, ప్రతి నిత్యం నా క్షేమ సమాచారాలను తెలుసుకుంటూ నాకు అవసరమైన సమయాలలో ఎంతో సాయమందిస్తూ నా కన్నకొడుకులా చూసుకుంటాడు నా అల్లుడు.



అజిత్ (అల్లుడు)

మా అత్తగారిని నేను తల్లిగానే భావిస్తాను. ఆమె కూడా నాకు తల్లి ప్రేమను అందిస్తూ అన్ని విషయాలలో మారు చేదోడువాదోడుగా ఉంటారు.



ఇందిర (అత్తగారు)

కోడలిని కూడా నా కొడుకుతో సమానంగా చూస్తాను. అందుకే నాకు కుటుంబంలో ఏ సమస్యా లేదు.

భవ్య (కోడలు)

అత్తంటే కుటుంబానికి ఆదర్శం. మా అత్తగారు మాకు అన్ని విషయాలలో తమ సహాయ సహకారాలు అందిస్తారు. నాకు పథనిర్దేశం చేసే మార్గదర్శకురాలు.



కాళ్ల మధ్య బెలూన్ పగులగొడుతున్న మహిళా పోలీసులు



బరువెత్తే వ్యాయామ పోటీ

మానసిక ఒత్తిడి అధిగమించేలా...

● పోలీసులకు వ్యాయామం, క్రీడా పోటీలు

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసులు మానసిక ఒత్తిడి అధిగమించేలా వ్యాయాయం, క్రీడా పోటీలు కోయంబత్తూర్ నగరంలో శనివారం జరిగాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న వారు అధిక పనిభారం, ఒత్తిడితో గురవుతున్నట్లు సర్వేలో వెల్లడైంది. వీటిని అధిగమించేలా కోవై నగర పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలురకాల వ్యాయామం, క్రీడా పోటీలు నిర్వహించారు. కోవై నగర పోలీసు శాఖ సాయుధ దళం మైదానంలో అసిస్టెంట్ కమిషనర్ శవరణన్ పర్యవేక్షణలో, మానసిక ఒత్తిడి అధిగమించేలా బెలూన్లు పగులగొట్టడం సహా పలు శిక్షణలు అందించారు. ఈ శిక్షణలో 100 మందికి పైగా పురుషులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'మీరు మాతో ఉంటేనే....!'

● పారిశుధ్య కార్మికులకు డిప్యూటీ సీఎం ఉదయనిధి అభినందన



కార్మికులకు బిర్యానీ వడ్డిస్తున్న డిప్యూటీ సీఎం

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంతటి భారీవర్షం కురిసినా చెన్నై ప్రజలను కాపాడేందుకు తమ వెంట ఉండాలని పారిశుధ్య కార్మికులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కోరారు. స్థానిక వెప్పేరిలోని ఓ ప్రైవేటు పాఠశాల మైదానంలో ఉత్తర చెన్నై జిల్లా పరిధిలో భారీ వర్షాల్లో కూడా పారిశుధ్య పనుల్లో పాల్గొన్న కార్మికులు, నర్సులు అని మొత్తం 1,000 మంది కార్పొరేషన్ ఉద్యోగులకు ఉదయనిధి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వారం రోజుల క్రితం మీడియాలో వర్షం గురించే మాట్లాడారన్నారు. ఏడాదిలో కురవాల్సిన వర్షం ఇటీవల ఒకే రోజు కురిసిందన్నారు. ఈ ఏడాది ముఖ్యమంత్రి, అన్ని శాఖల మంత్రులతో సమావేశమై వర్షాల ముందస్తు చర్యలపై చర్చించారని తెలిపారు. ఎంతటి వర్షం కురిసినా మూడుగంటల్లో వరద నీరు తొలగించాలని, ఏ ప్రాంతంలో కూడా వర్షపు నీరు ఉండరాదని సీఎం ఆదేశించారని తెలిపారు. అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేశాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు శేఖర్ బాబు, కేఎన్ నెహ్రూ, మధ్య చెన్నై ఎంపీ దయానిధి మారన్, కార్పొరేషన్ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి-బిడ్డ కథ....

తన బిడ్డను అమ్మ ఉదయాన్నే స్నానం చేయించి బయటకు పంపింది. కానీ, ఆ బిడ్డ బయట నుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఒళ్లంతా బురదతోనే వచ్చేవాడు. ఆ సమయంలో బిడ్డను చూసి తల్లికి కోపం వస్తుంది. కానీ, అది చిరుకోపం. అలాగే, మీరు కూడా పని చేస్తున్నారు. చెన్నై ఆ బిడ్డ కాగా, మీరు (పారిశుధ్య కార్మికులు) ఆ తల్లి అంటూ ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే, వర్షం కురిసిన 12 గంటలల్లోనే అదే వేగంతో పనిచేశారని అన్నారు. నగర ప్రజలకు పారిశుధ్య కార్మికుల సేవలు అభినందించేలా పారిశుధ్య కార్మికులు, నర్సులు అని 1280 మందికి బహుమతులు అందజేశామని తెలిపారు. చీర, లుంగీ, రెయిన్ కోట్, 5 కిలోల బియ్యం, నూనె, పాల పౌడర్, మిరపపొడి, రూ.2 వేల ప్రోత్సాహక నగదు అందజేశామని తెలిపారు. ఇది ముగింపు కాదని, ఇదే ఆరంభమని, ఎంతటి వర్షం కురిసినా చెన్నై ప్రజలను కాపాడేందుకు తామున్నాము, తమతో పాటు రంగంలో మీరూ ఉంటారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఏర్పాటుచేసిన బిర్యానీ విందులో ఉప ముఖ్యమంత్రి స్వయంగా వడ్డించారు.

గూగుల్ పే, జీ పే ద్వారా లంచం

● కోతగిరిలో ఏసీబీ తనిఖీల్లో వెల్లడి

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోతగిరి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ పోలీసులు జరిపిన తనిఖీల్లో, అధికారులు జీపే, ఫోన్ పే ద్వారా లంచం తీసుకున్నట్లు గుర్తించారు. కోతగిరిలో స్థలాలకు పట్టాలు, అండగల్ సహా పలు సర్టిఫికేట్ల మంజూరుకు ఏజెంట్ల ద్వారా అధికారులు లంచాలు స్వీకరిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. వాటి ఆధారంగా ఇన్‌స్పెక్టర్ పరిమళాదేవి నేతృత్వంలో పోలీసులు ఈ నెల 24వ తేది కార్యాలయంలో దాడులు చేశారు. కార్యాలయ తలుపులు మూసివేసిన పోలీసులు, తహసీల్దార్, వీఏఓలు, కార్యాలయ ఉద్యోగులను వేర్వేరుగా విచారించారు. అప్పుడు స్వాధీనం చేసుకున్న నగదుపై ప్రస్తుతం ప్రకటన విడుదలైంది. తనిఖీల్లో కోతగిరి గ్రామ నిర్వహణ అధికారి కమల్ వద్ద రూ.6 వేలు, జగదల-1 వీఏఓ నవీన్‌కుమార్ వద్ద రూ.4,200 లెక్కలో చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, అసిస్టెంట్, వీఏఓల మొబైల్ ఫోన్లు తీసుకొని, వాటిలో జీపే, ఫోన్ పే, వాట్సాప్ యాప్‌లను అధికారులు పరిశీలించగా, అందులో అధికారులు లంచాలు తీసుకున్నట్లు తేలింది.

ఆ వివరాలు...

తహసీల్దార్ గోమతి: జీపే ద్వారా జూన్ 6 నుంచి అక్టోబరు 11వ తేది వరకు 33 సార్లు రూ.4,91,000 లంచం తీసుకున్నట్లు పొందినట్లు తేలింది. ఆమెకు మదురై ఎస్బీఐ శాఖ, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లో ఖాతాలున్నట్లు గుర్తించారు.

డిప్యూటీ తహసీల్దార్ ఎల్కే ఉమామహేశ్వరి: ఫోన్ పే ద్వారా మే 30 నుంచి సెప్టెంబరు 24వ తేది వరకు వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.1,20,000 లంచంగా పొందినట్లు నమోదైంది.

కోతగిరి-2 వీఏఓ కమల్: ఫోన్ పే ద్వారా జూన్ 10 నుంచి అక్టోబరు 8వ తేది వరకు రూ.22,800 లంచంగా స్వీకరించినట్లు నమోదైంది.

అరకోడు, కొక్కోడు వీఏఓ ప్రియ: జీ పే ద్వారా జూన్ 22 నుంచి అక్టోబరు 19వ తేది వరకు ఆమె బ్యాంక్ ఖాతాల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.54,750 లంచం పొందినట్లు నమోదైంది. ఈ వివరాలతో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించగా, లంచం తీసుకున్న అధికారులపై కేసు నమోదుచేసిన ఏసీబీ పోలీసులు విచారణ చేపట్టారు.



జవాన్లను అభినందిస్తున్న సత్యాదేవి

దేశ శిఖరాగ్ర గ్రామంలో సైనికుల సేవలు అభినందనీయం

● లయన్ సత్యాదేవి

చెన్నై, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్‌కు 2 కి.మీ దూరంలో దేశానికి శిఖరాగ్ర గ్రామమైన 'మాణా' వద్ద అతి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో జవాన్లు పని చేయడం ఎంతో అభినందనీయమని సామాజిక సేవకురాలు, లయన్ సత్యాదేవి పేర్కొన్నారు. బద్రీనాథ్ ఆలయ పర్యటన సందర్భంగా ఈ మాణా గ్రామాన్ని, దాని వెనక వున్న చైనా, టిబెటన్ ప్రాంతాలను భక్తులంతా సందర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులందరికీ భారత జవాన్లు రక్షణ కల్పిస్తారని, అలాంటి క్లిష్టపరిస్థితుల్లోనూ వారు దేశ సరిహద్దుల్ని కాపాడుతూ మనగలగడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఇటీవల తన బద్రీనాథ్ పర్యటన సందర్భంగా జవాన్లను ప్రత్యేకంగా అభినందించినట్లు సత్యాదేవి విడుదల చేసిన ప్రకటనలో గుర్తు చేసుకున్నారు.

వైద్యకోర్సులకు రూ.5 లక్షల డిపాజిట్ తప్పనిసరి

పెరంబూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లోని 292 సీట్లు ఖాళీగా ఉన్న నేపథ్యంలో, ప్రత్యేక కౌన్సెలింగ్‌లో పాల్గొనే ఎంబీబీఎస్ అభ్యర్థులు రూ.5 లక్షలను, బీడీఎస్ కోర్సుల్లో చేరేవారు రూ.2 లక్షల డిపాజిట్‌గా చెల్లించాలని వైద్య విద్య అడ్మిషన్ కమిటీ పేర్కొంది. ప్రభుత్వ, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మూడు విడతల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. పెరుందురై ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో 67, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 61... మొత్తం 129 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. అలాగే, ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో 23, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో నాలుగు, మేనేజ్‌మెంట్ కోటాలో 136 అని మొత్తం 163 బీడీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 28వ తేదిలోపు పూర్తిచేసి, 29వ తేది తుది జాబితా విడుదల చేసి, నవంబరు 5వ తేదిలోపు విద్యార్థులు కళాశాలల్లో చేరాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాజకీయ నేతల అరాచకాలను ఎదిరించే 'సేవకర్'



'సేవకర్'లో ప్రజిన్

తన ఊరివారికి, సమాజానికి మంచి చేయాలని పరితపించే ఒక యువకుడు. తన దారికి అడ్డొచ్చే రాజకీయ నేతల అరాచకాలకు ఎదురునిలబడి వారిని అంతం చేసే చిత్రంగా 'సేవకర్'ను రూపొందించారు. ప్రజిన్, షకానా హీరోహీరోయిన్లుగా నటించగా, సీనియర్ నటుడు బోస్ వెంకట్ పోలీస్ అధికారిగా, ఆడుగళం నరేన్ రాజకీయ నేతగా నటించారు. ఇతర పాత్రల్లో రాజేష్, హీమా, శంకరి, రూప, సునీల్, బాలు, షాజీ కృష్ణ, సాయి శంకర్, జిష్ణు జిత్ తదితరులు నటించారు. సంతోష్ గోపినాద్ కథను సమకూర్చి దర్శకత్వం వహించారు. సంగీతం ఆర్డీ మోహన్, కెమెరా ప్రదీప్ నాయర్. సిల్వర్ మూవీస్ ఇంటర్నేషనల్ పతాకంపై రాజన్ జోసెఫ్ థామస్ నిర్మించారు. వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ధైర్యంగా నిలబడి ఎదుర్కొనే యువకుడి పాత్రలో ప్రజిన్ నటించగా, అతనికి అండగా నలుగురు స్నేహితులు నిలబడుతారు. వీరంతా కలిసి తమ ఊరికి మంచి చేస్తుంటారు. దీంతో రాజకీయ నేతలను ప్రజలు పట్టించుకోవడం మానేస్తారు. దీన్ని జీర్ణించుకోలేని రాజకీయ నేతలు జైలులో ఉండే ముగ్గురు రౌడీలను తీసుకొచ్చి ఊరిలో హింసాత్మక చర్యలకు ఉసిగొల్పుతారు. వీరికి కొందరు పోలీసులు వత్తాసు పలుకుతారు. ఈ విషయం తెలుసుకున్న హీరో, తన నలుగురు స్నేహితులతో కలిసి రాజకీయ నాయకులపై ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తాడు. వీరికి సమాజంపై ఉన్నత భావాలు కలిగిన ఒక మంచి పోలీస్ ఉన్నతాధికారి బోస్ వెంకట్ తనవంతు సాయం చేస్తారు. చివకు ప్రజాసేవకు అడ్డంకిగా ఉండే రాజకీయ నేతలను హీరో ఎలా అణిచివేశాడన్నదే ఈ చిత్ర కథ. ఇందులో ఉన్న పాటలకు ఇప్పటికే మంచి ఆదరణ లభించాయి' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

● టీవీకే మహానాడు

నటుడు సౌందరరాజా సైకిల్ యాత్ర



నటుడు సౌందరరాజా సైకిల్ యాత్ర

అగ్రహీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు ఆదివారం భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు కోలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు సిద్ధమయ్యారు. ఇలాంటి వారిలో హీరో సౌందరరాజా. మహానాడులో పాల్గొనేందుకు ఆయన చెన్నై నుంచి సైకిల్ యాత్ర చేపట్టారు. స్థానిక వడపళనిలోని ఆయన నడుపుతున్న చారిటబుల్ ట్రస్ట్ 'మన్నుక్కుమ్ మక్కలుక్కుమ్ సమూగ నల అరకట్టలై' కార్యాలయం నుంచి శనివారం ఉదయం సైకిల్‌పై బయలుదేరారు. కోలీవుడ్‌లో ప్రముఖ నటుడుగా రాణిస్తున్న సౌందరరాజా... 'సుందరపాండియన్', 'వరుత్తపడాద వాలిబర్ సంఘం', 'జిగర్ తండా', 'పూజై', 'తెరి', 'ధర్మదురై', 'రెక్క', 'కత్తిసండై', 'బిగిల్' వంటి అనేక చిత్రాల్లో నటించారు. 'బిగిల్' సినిమాలో హీరో విజయ్‌తో కలిసి నటించే సమయంలో ఆయనకు బాగా దగ్గరయ్యారు. ఆ తర్వాత విజయ్ రాజీయ పార్టీని స్థాపించనున్నట్లు ప్రకటించగానే ఆ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా మారిపోయారు. టీవీకే తరపు నిర్వహించే అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ తనవంతు సాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విల్లుపురం జిల్లా విక్రవాండి వేదికగా జరిగి టీవీకే మహానాడులో పాల్గొనేందుకు తమ చారిటబుల్ ట్రస్ట్ తరపున 250 మందికితో కలిసి చెన్నై నుంచి మహానాడు వేదిక వరకు సైకిల్ యాత్రగా వెళ్లారు.

మీరా కదిరవన్' దర్శకత్వంలో 'హబీబి'



'హబీబి' ఫస్ట్‌లుక్

మీరా కదిరవన్ దర్శకత్వంలో 'హబీబి' పేరుతో కొత్త చిత్రం తెరకెక్కుతోంది. శుక్రవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి వి హౌస్ ప్రొడక్షన్ సమర్పణలో నేసమ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం సమకూర్చే ఈ చిత్రానికి ఛాయాగ్రహణం మహేష్ ముత్తుస్వామి. ఇస్లామిక్ కుటుంబంతో కూడిన ఫొటోను ఫస్ట్‌లుక్‌గా రిలీజ్ చేయగా, సీనియర్ దర్శకుడు కస్తూరి రాజా ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మీరా కదిరవన్ మాట్లాడుతూ, 'ఇది నా కలల ప్రాజెక్టు. ఇలాంటి సినిమానే నా తొలి ప్రాజెక్టుగా ఉండాలన్న లక్ష్యంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టాను. అది సాధ్యమయ్యేందుకు రెండు దశాబ్దాల సమయం పట్టింది' అని పేర్కొన్నారు. కాగా, ఇందులో నటించే నటీనటులతో ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

రెండు చిత్రాలను వదులుకున్న శ్రుతిహాసన్



వివిధ కారణాలతో హీరోయిన్ శృతిహాసన్ రెండు చిత్రాలను వదులుకున్నారు. వీటిలో ఒకటి తెలుగు చిత్రం ఉండగా, మరొకటి ఆంగ్లం. ప్రస్తుతం సూపర్‌స్టార్ రజనీకాంత్ - లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'కూలీ' చిత్రంలో రజనీ కుమార్తె పాత్రను పోషిస్తున్నారు. ఇదిలా వుండగా, ఆమె ఒప్పందం చేసుకున్న రెండు చిత్రాల నుంచి తప్పుకున్నారు. వీటిలో ఒకటి టాలీవుడ్ హీరో అడవి శేష్ హీరోగా తెరకెక్కే 'డెకాయిట్ : ఏ లవ్ స్టోరీ'. శ్రుతిహాసన్ హీరోయిన్. పాన్ ఇండియా స్థాయిలో తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ఇందులో తన పాత్రకు సంబంధించిన తలెత్తిన చిన్నపాటి వివాదం కారణంగా తప్పుకున్నారు. అలాగే, హాలీవుడ్ డైరెక్టర్ ఫిలిప్ జాన్ తెరకెక్కించే 'చెన్నై స్టోరీస్' అనే ఇంగ్లీస్ మూవీ నుంచి ఆమె వైదొలిగారు. నిజానికి ఈ ప్రాజెక్టులో హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేశారు. కానీ వివిధ కారణాలతో ఆమె తప్పుకున్నారు. ఆ తర్వాత శ్రుతిహాసన్‌ను ఎంపిక చేయగా, ఆమె కూడా ప్రాజెక్టును కూడా వదిలేశారు.


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకట్రావు

పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్ ప్రదర్శన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతిలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అమరులైన పోలీసులకు అంజలి ఘటించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు, పరికరాలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సాయుధ దళం శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పులి కాదండోయ్.. మేకపోతు


జీవకోన రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని ఓ మాంస దుకాణం వద్ద శనివారం పులితోలు కప్పుకున్నట్లు ఉన్న ఒక మేకపోతు కనిపించింది. చూడ్డానికి అచ్చం పులిలా ఉంది. శరీరమంతా పులిమచ్చలు ఉన్న ఈ మేకపోతు చూపరులను ఆకట్టుకుంది. ఇది శిరోహి జాతి మేకపోతని, ఒకప్పుడు రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకునేవారని, ప్రస్తుతం చుట్టుపక్కల పల్లెల్లోనే లభ్యమవుతున్నాయని దుకాణం యజమాని తెలిపారు.

- తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి








వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. శేషాచలం అడవులు అనేకానేక రకాల పక్షులకు ఆవాసాలు. ఈ కొండబారు వెంబడే ఉన్న తిరుపతి నగర పరిసరాల్లోనూ పిట్టలు తారసపడుతూ ఉంటాయి. వాన కురిసి వెలిసిన వేళ.. నగరంలోనూ, శివారు పల్లె ప్రాంతాల్లోనూ ఆంధ్రజ్యోతి తిరుమల ఫొటోగ్రాఫర్ కెమెరా కంటబడ్డ రకరకాల పక్షుల చిత్రాలు ఇవి. రామచిలుకలు, వడ్రంగి పిట్టలు, పిచుకలు, గిజిగాడు, పసలపోలుగాడు.. వంటి ఎన్నో రకాలు సందడిచేస్తూ కనిపించాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..


- ఆంధ్రజ్యోతి, తిరుమల






విహంగ గానం






కేక పుట్టించిన
మ్యూజిక్ షో





తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం జరిగిన యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ ప్రదర్శన యువతను కేరింతలు పెట్టించింది. అరవాన్ తమిళం, తెలుగులో ఏకవీర సినిమాకు సంగీతం కూడా అందించిన కార్తీక్ పాటలకు యువత భారీగా స్పందించింది. మహాగణపతి ప్రార్థనతో సంగీత విభావరి ప్రారంభమైంది. గజినీ సినిమాలోని ఒక మారు కలిసిన బంధం పాటతో ఉత్సాహం తారస్థాయికి చేరుకుంది. అరరె అరెరే మనసే జారే, ఉసురే పోయెను, సీతాకోకా నచ్చావే వంటి పాటలకు మంచి స్పందన లభించింది. స్టేడియం అంతా యువోత్సాహం కనిపించింది. ముఖ్యంగా యాంకర్ ప్రశ్నలకు యువతీయువకులు ఉత్సాహంగా స్పందించారు. కార్తీక్ పాడిన పాటలను హమ్ చేశారు. రెండు గంటలకు పైగా సాగిన సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించిందని చెప్పవచ్చు. కాగా ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. భారీ ధరలతో టికెట్టు కొన్నవారికి కూడా సరైన సీటింగ్ వసతి లేకపోవడంతో మహిళలు కూడా నిలబడే షో చూడాల్సి వచ్చింది. పార్కింగ్ కోసం సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. పాసుల విషయంలోనూ గందరగోళం నెలకొంది.

సనాతన ధర్మ పరిషత్‌కు సాధు, సంతుల మద్దతు

తిరుపతిలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని విజ్ఞప్తి

తిరుపతి (కల్చరల్), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రస్తావిస్తున్న సనాతన ధర్మపరిషత్ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు పలువురు సాధు, సంతులు ప్రకటించారు.తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొన్న ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు, అక్రమ మత మార్పిడుల నివారణకు, ఆలయాల నిర్వహణకు, ధర్మ పరిరక్షణకు సనాతన ధర్మపరిషత్ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. జాతీయ స్థాయిలో ఇటువంటి బోర్డు ఏర్పాటుకు కృషిచేయాలని సాధువులు, పీఠాధిపతులు, మఠాధిపతులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఇందుకోసం ప్రయత్నిస్తున్న ఏపీ ఉపముఖ్యమంత్రికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో గత పాలకులు ఆలయాలను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని చక్కదిద్దేప్రయత్నం చేస్తోందన్నారు. దేవస్థానాల పాలకమండళ్లలో తప్పనిసరిగా సాధువుల నుంచి ఒకరికి సభ్యత్వం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.ఇతర మతస్తులకు మక్కా, వాటికన్ నగరాల మాదిరిగా హిందువులకు తిరుపతిని పవిత్ర పుణ్యక్షేత్రంగా గుర్తించాలని, ఇక్కడ మద్యం, మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. **హిందువులకు వేంకటేశ్వరస్వామి ఆరాధ్య దైవమని, ఆయన సన్నిధిలో అన్యమతస్తులు పనిచేయడాన్ని అరికట్టాలని కోరింది.** ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణ రావు, తెలంగాణ సాధుపరిషత్ అధ్యక్షుడు శివానంద స్వామి, శంకర స్వామి, దేవానంద జీయర్, కామాఖ్యాపీఠానికి చెందిన భైరన్ గౌరవ్ స్వామి, నిరంజన్, తుమ్మా ఓంకార్ తదితరులు ప్రసంగించారు. రోజంతా జరిగిన ఈ ధార్మిక సదస్సులో 6 రాష్ట్రాలకు చెందిన మూడు వందలకు పైగా సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, భక్తులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.


జాతీయ హిందూ . ధార్మిక సదస్సులో పాల్గొన్న సాధు, సంతులు

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తిరుపతి రాక

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈనెల 28వ తేదీన తిరుపతి రానున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతి చేరుకోనున్న రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ తొలిరోజు కూటమి పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. మరుసటి రోజు జిల్లా అభివృద్ధి విషయమై కలెక్టర్‌తో సమీక్షించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుచానూరు రోడ్డులోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేయనున్నారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో 14 మంది అరెస్ట్


పట్టుపడిన నిందితులతో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

చిల్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్య కేసులో 14 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ రవిమనోహరచారి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన వేకువన గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు గ్రామంలోని హరిజనవాడకు చెందిన కొంతమందితో కలిసి అరుంధతీయవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలైన కాటయ్య, హరిప్రసాద్‌లను హత్యచేసేందుకు కుట్రపన్నారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి ముందు ఉన్న మోటారుసైకిల్‌ను పెట్రోలు పోసి తగలబెట్టారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ నిద్రిస్తున్న ఇంట్లోకి పెట్రోల్ సీసాలకు నిప్పంటించి వారిపై విసిరి హత్యాయత్నం చేయగా కాటయ్య, హరిప్రసాద్ మంటలను తట్టుకోలేక బయటకు రావడంతో వారిపై కత్తులతో దాడి చేశారన్నారు. కాటయ్య సమీప పొలాల్లోకి పారిపోగా హరిప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. హరిప్రసాద్ హత్యకేసులో నిందితులైన మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన దుంపాల మధుకుమార్, దుంపాల డేనియల్, మన్నెం మోజేస్, ముత్యాలపాడు గ్రామానికి చెందిన చిట్టెటి దినేష్‌రెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన మన్నెం శీనయ్య, మన్నెం మనెయ్య, దుంపాల సాయికృష్ణ, పనబాక మనోజ్‌కుమార్, కోట మండలం వంజివాక గ్రామానికి చెందిన పామల విష్ణు, తిమ్మినాయుడుపాళెం గ్రామానికి చెందిన కదూరు విశాల్, అల్లంపాడు గ్రామానికి చెందిన దుంపాల ఏసు, చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన దుంపాల చెంగమ్మ, ముత్యాలపాడుకు చెందిన నారపరెడ్డి వెంకటకృష్ణారెడ్డిలను అరెస్ట్ చేశామని వివరించారు. మండలంలోని చింతవరం- కోట రోడ్డులో ఏడుగురిని, ముత్యాలపాడు సమీపంలోని ఏఎంసీ గోదాము వద్ద ఏడుగురిని అరెస్ట్ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబు, సీఐలు కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, శేఖర్‌బాబు, బాబి, మురళీకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.